తృతీయ బహుమతి పొందిన కథానిక :

# "ప్రభూ! వీళ్లను క్షమించు"

—శ్రీ జక్కుల తిరువేంగళాచార్యులు

"ఒరేయ్ బకెట్‌తో సాంబారు తీసుకరా, రెడ్డిగారొచ్చారు" హోటల్ ప్రొప్రయిటర్ నాయర్ కౌంటర్ దగ్గరకు పోతూ వేసిన కేక.

"వచ్చారా! ఈయనగారిచ్చే డబ్బులు సాంబారుకు, మజ్జిగ నీళ్ళకే సరిపోతాయి." బకెట్‌తో వడ్డించడానికి పోతున్న సర్వర్ సణుగుడు.

ఈ రెండూ రెడ్డిగారు వినకపోలేదు. నింపాదిగా టేబులు ముందు కూర్చొని ధోవతిని మోకాలిపైకి త్రోసుకుంటూ సాంబారు వేయించుకోవడానికి విస్తరిలోని అన్నం పాదిలాగ చేశారు.

రెడ్డిగారు కూర్చున్న టేబిలు వద్ద ఇంకొకరు కూర్చోవడానికి స్థలముండదు. ఆయన భారీ శరీరం, విశాలమైన హస్తాలు, ఆ టేబిలును పూర్తిగా ఆక్రమిస్తాయి. విస్తర వేసి, అన్నం, పులుసు వడ్డించి పోయిన రెండు మూడు నిముషాలకు పై రెండు వాక్యాలు ప్రతిరోజు ప్రతిధ్వనిస్తుంటాయి హోటల్లో. రెడ్డిగారు రోజూ విని కంఠత పెట్టేశారు. రోజూ ఆ హోటలుకు వచ్చే పోయేవాళ్ళు అప్పుడప్పుడూ వింటూనే వుంటారు. అందరూ వెటకారంగా రెడ్డివైపు చూస్తారు, కానీ రెడ్డిమాత్రం వారిని దీనంగా చూస్తాడు. ప్రతిరోజూ మధ్యాహ్నం రెడ్డిగారు ఆ హోటలుకి రావటం ఖాయం, ప్రతిరోజూ ప్లేటు భోజనమే తీసుకుంటాడు.

ఎంత అన్నం పెడతారో అంత సాంబారు వేయించుకుంటాడు. ఒక గ్లాసు మజ్జిగ త్రాగుతాడు. చేయి కడుక్కొని రాగానే రెండు చెంబులు నిండుగా నీళ్ళు రెడీగా పెడతారు సర్వర్లు. రెండు చెంబుల నీళ్ళు చుక్క మిగుల్చకుండా త్రాగేస్తాడు. అంత పెద్ద పొట్టకు నాయర్ పెట్టే భోజనం చాలక నీళ్ళు నింపుతున్నాడని క్రొత్తవాళ్ళనుకుంటారు. రెడ్డి ఏనాడూ పూర్తి భోజనం తినలేదు. అది ప్రతిరోజూ హోటలుకు వచ్చే ఖాతాదారులకు తెలుసు.

'ఎన్ని నీళ్ళు తాగితే అంత ఆరోగ్యమండీ దేహానికి' అంటాడు రెడ్డి పలెభాషలో. 'అందుకేనేమో ఆయన ఆరోగ్యంగా వున్నాడు, మనమూ అలా చేద్దాం' అని హోటలు మెతుకుల్తో ప్రాణాలు పోగొట్టుకునే ఆఫీసు గుమాస్తాలనుకుంటారు. కానీ చెయ్యలేకపోతారు. ఇది అందరికీ విచిత్రమయినదే

మరీ విచిత్రమయినది ఆయన నడక. చంకలో గొడుగు, భుజాన కండువా, ఎడమ రొమ్ముపై నున్న చొక్కా జేబునిండా ఏవేవో కాగితాలు, కుడివైపు ప్రక్క జేబులో నిండా కాగితాలు, ఒకవైపు ఎగగట్టిన ధోవతి, ఎప్పుడూ తైలసంస్కారంలేక అర్ధంగుళం పొడవు గలిగి, మునిసిపాలిటీ పార్కులో ఎండిపోతున్న గడ్డిలాంటి వెంట్రుకలు, పొట్టిగా లావుగా, ఒక విధంగా నీగ్రోలాగ కనిపిస్తూ, వీధుల్లో పోతూవుంటే రెడ్డిగారు అందర్నీ ఆకర్షిస్తారు

ఆయన స్వగ్రామం పట్టణానికి మూడుమైల్లున్న పల్లెటూరు. ఆ గ్రామానికి ఆయన గ్రామ మునసబు. ప్రతిరోజూ పట్టణానికి రావడం, తాలూకాఫీసులో

పం[డేండింటిదాకావుండి, తరువాత నాయర్ హోటల్లో భోంచెయ్యడం, ఆయనకలవాటు. మనిషినిచూస్తే అమాయకుడుగా కనిపిస్తాడు. లేకపోతె ఈ హోటలు వాళ్లు అనే మాటలకు ఇంకొకరయితె వాళ్ళను చితుగా తన్నేస్తారు. వాళ్లు ఆయన్ని ఎ గ తా ళి చె య్యి డం, ఆయన ప్రతిమాటకూ ఒక పొడిదగ్గు దగ్గి గుండుపై చెయ్యి పోనిచ్చి తుడుచుకోవడం మామూలయిపోయింది.

రెడిగారు హోటలు లోనికి రాగానే మొదలవుతాయి గుసగుసలు. "సాంబా[రెడ్డొచ్చా[డోయ్. నీళ్లు దండిగా తెచ్చి పొయ్యండి" ఇవాయనకు మామూలే! ఒక వేళ అది ఆయనకు మామూలే అనుకున్నా మిగతా వాళ్ళకు ఆయనకు అలవాటైతే ఏమి పని. అనవసరంగా ఒకరి స్వవిషయాల్లోకి జొరబడడం ఈ కాలం మామూలై పోయింది. చదువూ సంస్కారం లేని సర్వర్లకే కాకుండా, అన్నీ వుండి వుద్యోగంలోవున్న వారికి కూడ రెడ్డి గారు లోకువయ్యారు.

ప్రతిరోజూ మధ్యాహ్నం అదే హోటలుకు రావడంతో ఆహోటలు వాళ్ళకు మరీ లోకువయ్యారు. ప్రతి ఆదివారం నాయర్ స్పెషల్ భోజనం పెడతాడు. నెలసరి ఖాతా వాళ్ళకు పులిహోర, బాదం ఖీర్ ఆనాటి ప్రత్యేకత. ఆదివారం నాడు తాలూకాఫీసు శెలవు కాబట్టి రెడ్డిగారు ఆవేళ వచ్చేవాడుకాదు. ఆ నాడెందుకనో వచ్చాడు. అదే హోటలు కొచ్చాడు...నెలసరి ఖాతా దారల్తో పాటు రోజూ మధ్యాహ్నం ఆ హోటలుకు వస్తూనే వున్నా రెడ్డికి, ఆవేళ మామూలు ప్లేటు భోజనమే వడ్డించడం జరిగింది, అన్ని బల్లల దగ్గర కూర్చున్న వారంతా పులిహోర తింటున్నారు. రెడ్డికి మాత్రం లేదు. చూసేవాళ్ళకు రెడ్డి మరీ లోకువై పోయాడు. రెడ్డి యిదేమీ లెక్క చెయ్యకుండా గుండు రుద్దుకుంటూ సాంబారుకు రెడీగా వున్నాడు.

"పట్టవయ్యా పట్టు! అన్నం కలుపుకో" అన్న గద్దింపుతో సాంబారు వేయడం జరిగింది.

"ఏం రెడ్డిగారికి స్పెషల్ భోజనం లేదా ఈవేళ" అన్నారెవ్వరో.

"ఇచ్చేది ప్లేటు భోజనం డుబ్బు. వడ్డీలకు వడ్డీలు ఎత్తుకుంటాడే ఫుల్ మీల్స్ దుట్టిస్తే ఎందుకు పెట్టము" అన్నాడు నాయర్ అరవంతో కలిపిన తెలుగులో. నిజానికి రెడ్డికి ఆ పులిహోర తినాలన్న ఆశ అసలే వుండదు. అలాంటి పులిహోర వాళ్ళ వూర్లో ఎంత మందికైనా పెట్టగలడు తాను. తనకున్న గౌరవమూ, పలుకుబడిలో ఈ నాయర్ ఆలోచన ఎంత. అందుకనే ఆయన కదలకుండా ధీమాగా కూర్చున్నాడు

కానీ అందరికీ ఆనాటితో తెలిసిన సత్యమేమిటంటే, రెడ్డి ఒక వడ్డీ వ్యాపారస్తుడని. ఇంతవరకూ ఒక అమాయకుడను కున్నారు. ఇపుడు వడ్డీ వ్యాపారి ఎంత అమాయకుడుగా వుంటాడో వూహించు కున్నారు. రెడ్డిగారు హోటలు దాటగానే నాయర్ చెప్పిన సారాంశమిది. రెడ్డి తాలూకాఫీసు గుమాస్తాల కందరికీ వడ్డీలకు డబ్బులిస్తాడు. ప్రతిరోజూ వాళ్లున్నారా లేదా అంటూ తిరుగుతుంటాడు. వాళ్ళని తొందరగా బాకీ చెల్లించమని బలవంత పెడుతుంటాడు. అసలు లేకపోయినా వడ్డీ పుచ్చుకుంటాడు. నూటికి వది రూపాయలు వడ్డీ, వారాని కోసారి వడ్డీ వసూలు. వారంలో ఒక్కో రోజు ఒక్కొక్కరి వంతు వచ్చేలాగుంటారు యితని ఖాతాదార్లు. నెలనాడు మొత్తం ఒక్కసారిగా యివ్వలేక, పర్మిట్లకోసం వచ్చిన వాళ్ళ దగ్గర కాఫీ డబ్బులకని యిప్పించుకున్న వాళ్ళ కాగితాలను తహశీల్దారు వరకూ చేరుస్తూ, ఆ డబ్బును రెడ్డికి వడ్డీక్రింద జమ కట్టుతుంటారు. ఈ వడ్డీలతో రెడ్డిగారికా పూట మధ్యాహ్నం భోజనం జరుగుతుంది. రాత్రికి యింటికి పోతాడు.

'చూస్తే నవ్వు వచ్చేలాగుండే మనిషిలో యింత రహస్యం దాగుందా' అనుకున్నారంతా! అసాధ్యుడన్నారు కొందరు.

సాధారణంగా రెడ్డి హోటల్లో మాట్లాడడు. తనకు వడ్డించిన భోజనం దండిగా సాంబారు వేయించుకుని తినడం, పెట్టిన రెండుచెంబుల నీళ్లు త్రాగడం, కౌంటరు దగ్గర డబ్బులు చెల్లించడం_ యధాలాపంగానే జరిగిపోతుంటాయి. ఒకనాడు హోటల్లో రెడ్డిగారి కీచుగొంతు ఖంగుమంటోంది. నాయర్‌ను దబాయిస్తున్నాడు, ఈవేళ విజృంభించినట్లున్నాడు.

"ఎవడు రమ్మన్నాడయ్యా ఓట్టలికి" నాయరే అంటున్నాడు.

"ఏడిసిందిలే! నీవొక్కడివే పెట్టినట్లిక్కడ. ఓట్ల లట. ఓట్టలు" రెడ్డిగారి సమాధానం.

"ఇది కాకపోతె నీకు గతిలేదే! ఎవడు పెడతాడు నీవిచ్చేదుట్టుకు. ప్లేటు భోజనానికి మూడు ప్లేట్లు సాంబారు త్రాగుతావు" నాయర్ విజృంభించినాడు.

ఆ సమయంలో రెడ్డిగారు కాకుండా మిగతా ఎవ యినా అయితె తల తీసివేసినంతగా సిగ్గుపడివుండును. అసలు జరిగిందేమిటంటే మూడు రోజులనుంచీ రెడ్డి డబ్బివ్వలేదు. వడ్డీలు వసూలు కాలేదేమో! ఈవేళ మొత్తం యిస్తుంటే నాయర్ ఒకరోజు ఎక్కువని వాదిస్తున్నాడు.

"ఇంతేనయ్యా వీళ్లు. ఎక్కడనుండో. ఏ దేశం నుండో వచ్చి. యిక్కడ దమ్మిడీ దమ్మిడీ సంపా యించి ఇప్పుడు మనకే మొనగాళ్ళయినారూ! మొదట యిక్కడకు వచ్చినపుడు వీళ్ళను కుక్కలు కూడ వాసన చూడవు" ఎప్పుడూ పల్లెత్తు మాట మాట్లా డని రెడ్డి ఆ రౌద్రరూపం దాల్చాడు.

"నీ వడ్డీ వ్యాపారాని కంటేనా" నాయర్ ఖండన.

"చాల్లేవయ్యా, తీసుకో డబ్బులు" అంటూ విసు రుగా టేబిలుపై డబ్బులు పెట్టి విసురుగా వెళ్ళిపో యాడు. రెడ్డిగారికి ఆ హోటల్లో జరుగుతుండిన గౌరవ మర్యాదలకు సానుభూతి చూపినవారికి 'ఇక రెడ్డి ఆ హోటలుకు రాదేమో' అనిపించింది.

చరిత్ర పుటల్ని తిరగవేస్తే. ప్రజలు క్షమార్పణ కోరడం, భూపతులు క్షమించడం గమనించవచ్చు. సంస్కృతికి భిన్నంగా తయారవుతున్న నేటి నవ నాగరిక సమాజంలో క్షమార్పణ కోరేవాడే లేడు. క్షమించే వాడే లేడు ప్రతి వాడూ తప్పు చేస్తూనే వున్నాడు. చేసిన తప్పునుసమర్థించుకుని శిక్ష తప్పించు కుంటున్నాడు, ఇక క్షమార్పణకు ఆస్కారమే లేదు. మానవులను క్షమార్పణ వేడుకోవడం అటుండనిచ్చి. దైవాన్ని కూడ క్షమించమని అడగరు. ప్రజల్లో క్షమాగుణం నశించింది. పొరపాటున ఎవ్వడయినా తనకా కన్యాయం చేస్తే-ప్రతీకారం తీర్చుకోనిదే వద లరు నేటి మానవులు.

రెడ్డిగారి విషయంలో కూడ అలాగే అనుకున్నా రంతా. రెడ్డి పట్టణంలో తనకున్న పలుకుబడిని గౌర వాన్ని ఉపయోగించుకుని, నాయర్‌పై ప్రతీకారం తీర్చుకోవడం తప్పదని అనుకున్నారంతా. ఆ వేళ రెడ్డిగారి ముఖ కవళికల్ని పరిశీలించినవారు. ఇక ఆ స్థానంలో నాయర్ హోటలుండదు.రెడ్డి అక్కడకు రాడు అనుకున్నారు.

మరునాడు మధ్యాహ్నం ఒంటిగంటకు భోజనానికి వచ్చిన ఆఫీసు గుమాస్తాలకు, రెడ్డిగారా హోటల్లో కూర్చుని భోంచేస్తూడడం చూసేసరికి ఆశ్చర్యం వేసింది. గుమాస్తాలకే కాదు, ఈవిషయంలో నాయర్ కూడ ఆశ్చర్య పడినట్లున్నాడు.

ఏసు క్రీస్తును సిలువ వేసేటప్పుడు, తన్ను హింసించే ప్రజల గూర్చి, క్రీస్తు దేవున్ని యిలా ప్రార్థించాడట: "ప్రభూ వీరు అమాయకులు. వీరేం చేస్తున్నారో వీరికే తెలియదు. వీళ్ళను క్షమించు."

వడ్డీ వ్యాపారి రెడ్డిలో కూడ ఈ క్షమాగుణం మొలకెత్తిదంటే ఆశ్చర్యమే.